క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. పీఅండ్‌టీ కాలనీ, నుకాలమ్మ గుడి, సెయింట్ ఆన్స్ స్కూల్ రోడ్డు, డాబాకోట్లు రోడ్డు, యార్డు రోడ్డు, వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం రోడ్డు, రాజరాజేశ్వరిపేట రోడ్డు, గంగానమ్మ గుడి ఎదురు ఎంకే బేగ్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మైండ్ కంట్రోల్ టెక్నాలజీ పరిశోధనలతో ముప్పు


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మైండ్ కంట్రోల్ పరిశోధనలు మానవాళికి ముప్పు తెచ్చే అవకాశం ఉందని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఎన్ఆర్ఐ తరుణ్ రావి అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మైండ్ కంట్రోల్ పరిశోధనల ఫలితంగా సంభవించే ముప్పును ఆయన వివరించారు. ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తోందని, మానవ జాతిని బానిసలుగా మార్చే కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మానవుల ఆలోచనలను చదివి, మానవ మెదడులను ప్రభావితం చేసే టెక్నాలజీని కొన్ని గుర్తుతెలియని సంస్థలు అభివృద్ధి చేసి మనుషులను గిన్నిపిగ్స్‌గా వినియోగించుకుంటున్నాయన్నారు. కొన్ని సంస్థలు పరిశోధనల ఫలితంగా న్యూరో వెపన్స్, ఎనర్జీ వెపన్స్ వచ్చాయని, ఇవి మానవ మెదళ్లను ప్రభావితం చేస్తాయన్నారు. మన ఆలోచనలను తెలుసుకోవడమే కాకుండా అనేక రకాలైన బాధలను కలిగిస్తాయని చెప్పారు. దీనినే హవానా సిండ్రోమ్ అంటారన్నారు. మానవాళిపై వీటి ప్రభావం తీవ్రం కాకముందే ప్రభుత్వాలు స్పందించి ఈ తరహా ప్రయోగాలకు అడ్డుకట్టవేయాలని కోరారు.

నగరంలో టోఫెల్, జీఆర్ఈ పరీక్షా కేంద్రం ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్‌ఏ ఫారిన్ లాంగ్వేజ్, గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్(జీఆర్ఈ) పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఈటీఎస్ ఇండియా చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ లెజో సామ్ ఊమెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము విజయవాడలో ప్రపంచ స్థాయి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో యూఎస్ఐ2జీవో సర్వీసెస్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే వారికి పరీక్షలు రాసేందుకు ఈటీఎస్ ఎగ్జామ్ సెంటర్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఇక్కడ పరీక్షలు రాసిన వారు యూఎస్, కెనడా, ఆస్ట్రేలియా, యూకే, జర్మనీ వంటి దేశాలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈటీఎస్ ఆధ్వర్యాన నగరంలో యూఎస్ఐ2జీవో సర్వీసెస్‌తో కలిసి పరీక్షా కేంద్రంను ప్రారంభించటం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కేంద్రం వల్ల రాష్ట్రంలోని విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కరాటే విజేతలకు అభినందన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈ నెల 3న కర్నూలులో జరిగిన 11వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ -2023లో జేకే గోజూరై కరాటే అకాడమీ సత్యనారాయణపురం బ్రాంచ్‌కి చెందిన బాలికల కేటగిరి అండర్ - 18 విభాగంలో షణ్ముఖి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే బాయ్స్ కేటగిరి అండర్ - 10 విభాగంలో కృష్ణ యాదవ్ తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిద్దరినీ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరినాథ్, సత్యనారాయణపురం బ్రాంచ్ కోచ్ పీవీకెఎస్ హర్ష అభినందించారు. గొల్లపూడిలోని జేకే గోజూరై కరాటే అకాడమీకి సంబంధించి నగరంలోని వివిధ బ్రాంచిల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

విశాఖ డెయిరీ పార్లర్ ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులోని శారదా కళాశాల ఎదురుగా విశాఖ డెయిరీ అవుట్ లెట్ ప్రారంభమైంది. డెయిరీ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్‌రాజు అవుట్ లెట్‌ను ప్రారంభించారు. విశాఖ డెయిరీ నిర్వాహకులు రాజ కుమార్ మాట్లాడుతూ.. 24 గంటలు పాలు, పెరుగు, వెన్న, నెయ్యి లభిస్తాయన్నారు. డెయిరీ సేవలను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డెయిరీ మేనేజర్ రాధాకృష్ణ, సూపర్‌వైజర్ జగదీష్, హరికృష్ణ, ఏజెంట్స్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- వాడవాడలా శ్రీకృష్ణునికి విశేష పూజలు
- నేడు కొనసాగనున్న వేడుకలు
- కృష్ణతత్వం ఆచరణీయం
- ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): లోకానికి జ్ఞానాన్ని పంచిన గీతాచార్యుడైన శ్రీకృష్ణుని జన్మదినోత్సవం సర్వమానవాళికి పర్వదినమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీం, శ్రీరామకృష్ణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నికృష్ణులు, గోపికల వేషధారణ ఆకట్టుకున్నాయి. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మహావిష్ణువు ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణపరమాత్మ స్వరూపమని.. దశావతారాలలో పరిపూర్ణమైనదని పేర్కొన్నారు. శ్రావణమాసం కృష్ణపక్షం అష్టమి తిథినాడు ఆ మధుసూదనుడు జన్మించాడని, ఆ గోకుల నందనుడు జన్మదిన మహోత్సవాన్ని గోకులాష్టమిగా నిర్వహించడం హైందవ సంప్రదాయమని వెల్లడించారు. కృష్ణతత్వం చదివిన వారికి నిజమైన ప్రేమతత్వం తెలుస్తుందని.. గీతా సారాన్ని మనసున నింపుకోగలిగితే జీవితం సంతోషమయం అవుతుందని తెలిపారు. 250 మంది చిన్నారులు గోపిక కృష్ణులు వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమం సందడిగా జరిగింది. శారద స్కూల్ కమిటీ పెనుమత్స అప్పలరాజు, హెచ్ఎం జి.హరిత మాధవిలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామివారి దేవాలయంలో బుధవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. లక్ష తులసి అర్చన విశేష అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.



కృష్ణాష్టమి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ



ఇంద్రకీలాద్రిపై పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పాయకాపురంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

మధురానగర్‌లో..

మధురానగర్ శ్రీ కృష్ణ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీ లక్ష్మీగణపతి సమేత అష్టలక్ష్మి కుబేర హోమం జరిగింది. గురువారం ప్రత్యేక పూజలు, ఉట్టి కొట్టే కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఇంద్రకీలాద్రిపై, ఇస్కాన్ టెంపుల్‌లో వేడుకలు వైభవంగా నిర్వహించారు.

త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో

పాయకాపురం(విజయవాడరూరల్): సజ్జనుల సంరక్షణార్థం శ్రీకృష్ణ పరమాత్ముడు జన్మించారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పాయకాపురం ఏపీఎస్‌రెడ్డి రోడ్డులో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకల్లో మేయర్ భాగ్యలక్ష్మి బుధవారం పాల్గొన్నారు. జగద్గురువు శ్రీకృష్ణుడు చెప్పినటువంటి జ్ఞానాన్ని 10 మందికి తెలియజేయడం అనేది గొప్ప విషయమన్నారు. ఆ దేవుని ఆశీస్సులు అందరి మీద ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇస్కాన్ టెంపుల్‌లో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న నిర్వాహకులు

నేడు ముత్యాలంపాడులో వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు రావిచెట్టు సెంటర్‌లో శ్రీకృష్ణ సేవాసమితి యాదవ సంఘం ఆధ్వర్యాన గురువారం నిర్వహించబోయే శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు బుధవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు సేవాసమితి సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ గురువారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, తులసి అర్చన జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్ర ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. శ్రీకృష్ణాష్టమి వేడుకలకు తాను తప్పక హాజరు అవుతానన్నారు. స్వామివారి ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ అందాలని శ్రీ కృష్ణుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 31వ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, సమితి సభ్యులు ఆర్ శ్రీనివాసరావు, కళ్యాణ్, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక చిన్నారుల సందడి



ప్రత్యేక చిన్నారుల ప్రదర్శనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణా సంస్థ కార్యాలయంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా బుధవారం ప్రత్యేక చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో సందడి చేశారు. తాము మిగిలిన వారికి ఏ మాత్రం తీసిపోమనే విధంగా శ్రీ కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో ప్రత్యేక చిన్నారులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణ కుమారి శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించారు. అనంతరం ప్రత్యేక చిన్నారుల చేత ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

లక్ష వెండి పుష్పాలకు పూజ



లక్ష వెండి పుష్పాలను తీసుకువస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సింగ్‌నగర్‌లోని బసవపున్నయ్య స్టేడియంలో 8వ తేదీ నుంచి నిర్వహించే నవకుండాత్మక శ్రీ వైభవ మహాలక్ష్మి యాగానికి వినియోగించే వెండి పుష్పాలకు బుధవారం దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి పుష్పాలతో ఇంద్రకీలాద్రికి విచ్చేసిన నిర్వాహకులు దుర్గమ్మను దర్శించుకున్నారు. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ప్రారంభమైన ఊరేగింపులో శివజ్ఞానపీఠం పీఠాధిపతి శివాచార్య స్వామి పాల్గొన్నారు. అనంతరం దేవస్థానానికి చేరుకున్న నిర్వాహకులు అమ్మవారి పాదాల చెంత వెండి పుష్పాలను ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొనకళ్ల విద్యాధరరావు, పల్లపోతు మురళీకృష్ణ, కొనకళ్ల సత్య కృష్ణప్రసాద్, శనగపల్లి అంబిక ప్రసాద్, కొల్లిపర రాజేష్, శ్రీధర్, పేర్ల శ్యాంప్రసాద్, కెఎస్.దీక్షితులు, నాగలింగం శివాజీ, విజయలక్ష్మి, హైమావతి పాల్గొన్నారు.

9న పరమశివుని విగ్రహ ప్రతిష్ఠ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శివాలయం వద్ద ఈ నెల 9వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు దాత ఎస్.వెంకటేశ్వరరావు సహకారంతో పరమ శివుని విగ్రహ పత్రిష్ఠ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ శుక్రవారం స్వామివారి విగ్రహాన్ని మేళతాళాలు డప్పువాయిద్యాలతో మధురానగర్ వీధుల్లో ఊరేగింపు జరుగుతుందన్నారు. 9వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం భారీ అన్నప్రసాద వితరణ చేపడతామన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

కళాశాల స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు



గులాబీతోట ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల స్థలంలో నిర్మించిన ప్రహరీ



ప్రహరీని తొలగించిన దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గులాబీతోటలోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి హెచ్చరించారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇటీవల కళాశాలకు చెందిన స్థలంలో ప్రహరీ నిర్మించటంతో తాము జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సదరు ప్రహరీని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారన్నారు. నగరపాలకసంస్థ ప్లానింగ్ సిబ్బంది ప్రహరీని కూల్చివేశారని తెలిపారు. కళాశాలకు చెందిన స్థల వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని, ఈ స్థలంలో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాము ప్రభుత్వ నిబంధనల మేరకు కళాశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆసక్తి కలిగిన విద్యార్థులు కోర్సుల్లో చేరాలని ప్రిన్సిపాల్ కోరారు.

టైగర్ నాగేశ్వరరావు సినిమాను నిషేధించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎరుకుల జాతిని పుట్టుకతో దొంగలుగా, స్టువర్టుపురం గ్రామాన్ని దక్షిణ భారతదేశపు నేర రాజధానిగా ముద్రవేస్తూ నిర్మించిన టైగర్ నాగేశ్వరరావు సినిమాను నిషేధించాలని స్టువర్టుపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. సినిమా విడుదలను నిలిపివేయాలని, దర్శక నిర్మాతలపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింది కేసులు బనాయించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న గ్రామానికి చెందిన చుక్కా పాల్ రాజు మాట్లాడుతూ టైగర్ నాగేశ్వరరావు పేరిట సినిమా నిర్మించడం ఎరుకల కులాన్ని, స్టువర్టుపురం గ్రామ ప్రజలను అవమానించడమేనన్నారు. స్టువర్టుపురంలో నేడు ఐఏఎస్, ఐపీఎస్‌లు ఇతర ఉన్నతాధికారులు, ఎప్పుడో జరిగిన అంశాన్ని తీసుకుని సినిమా తెరకెక్కించడం ఎరుకుల జాతి ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీయడమేనన్నారు. సినిమా విడుదల అయితే స్టువర్టుపురం గ్రామాన్ని, ప్రజలను చిన్న చూపు చూస్తారన్నారు. తక్షణం టైగర్ నాగేశ్వరరావు సినిమాపై నిషేధం విధించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. ధర్నాలో స్టువర్టుపురం గ్రామానికి చెందిన పేరం రవికుమార్, చౌట భాస్కరరావు, వల్లాగి కాంతారావు,గజ్జెల జోసఫ్, కంపా ఇమ్మానియేల్, రాగాల రాము ,అంగిడి రత్నకుమార్, దాసరి మరియబాబు, కర్రెద్దుల రామారావు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న స్టువర్టుపురం గ్రామస్తులు

నేటి నుంచి 29వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మధురానగర్(విజయవాడసెంట్రల్): 29వ డివిజన్ మధురానగర్ సాయిబాబా కాలనీ ఫస్ట్‌లైన్ నుంచి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాదయాత్రలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిపిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వధువుకు ఆర్థిక సాయం అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈ నెల 7వ తేదీన వివాహం కానున్న నూతన వధువుకు ఆర్యవైశ్య సేవా సంఘం (గొల్లపూడి) పసుపు –కుంకుమ, చీరతో పాటు రూ.18 వేల నగదును వితరణ చేసింది. విజయవాడ వన్‌టౌన్‌లో నివసిస్తున్న పేద వైశ్య కుటుంబానికి చెందిన యువతి రూపాదేవి, రాజేష్‌ల వివాహం మణుగూరులో జరుగుతున్న క్రమంలో బుధవారం నూతన వధువుకు ఈ వితరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం జనరల్ సెక్రటరీ చన్నా పద్మావతి మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు విద్య, వైద్యం తదితర అంశాలకు సంబంధించి సంఘం తరపున సహాయం అందించామన్నారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్యవైశ్యులు ప్రతీకలుగా నిలవడం గర్వకారణంగా ఉందని చెప్పారు. సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తున్న సంఘ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మద్దాలి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చల్లా జనార్దనరావు, చన్నా సాంబశివరావు, గంగాధరరావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ రాయప్పరాజు వీధికి చెందిన బాయన నాగ వెంకట శంకరరావు టైలరింగ్ చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. శంకరరావుకు ఇద్దరు సంతానం కాగా కుమార్తె షణ్ముక పూజిత(22) డిగ్రీ వరకు చదివి, ప్రస్తుతం బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటుంది. 5వ తేదీ బ్యూటీ పార్లర్‌కు వెళ్లిన పూజితను తీసుకువచ్చేందుకు శంకరరావు ఫోన్ చేయగా, డ్యూటీకి రాలేదని చెప్పారు. దీంతో ఆందోళన చెందిన ఆయన బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో యువత రాణించాలి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఎమ్మెల్యే విష్ణును సన్మానిస్తున్న కమిటీ పెద్దలు, విజేతలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్య, క్రీడలతో పాటు అన్ని రంగాల్లో యువత రాణించి, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. ఈ నెల 3న సింగ్‌నగర్‌లో జరిగిన వైఎస్సార్ మెమోరియల్ 5వ జాతీయ ఓపెన్ కుంగ్ ఫూ, కరాటే చాంపియన్ షిప్ విజయవంతం కావడంతో ఆ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే విష్ణును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ టోర్నీ నిర్వహణకు ఎమ్మెల్యే విష్ణు అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో తాము మరింత కష్టపడతామన్నారు.

జాతీయ స్థాయిలోనూ రాణించాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయంగా తాము పనిచేస్తున్నామని, ప్రజలు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకోవడానికి, శారీరక, మానసిక దృఢత్వానికి ఆత్మరక్షణ విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. బాలికల్లో ప్రధానంగా కరాటే విద్య ఆత్మస్థైర్యాన్ని మరింత పెంపొదిస్తుందని చెప్పారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. నవంబర్ 26న జరగబోయే సీనియర్ జాతీయ స్థాయి పోటీలలోనూ ఇలానే రాణించాలని ఆకాంక్షించారు. ఆత్మరక్షణ విద్యనభ్యసించే యువతకు తన ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టోర్నమెంట్ చీఫ్ ఇన్‌చార్జి, వైఎంకే అకాడమీ ఫౌండర్ గల్లా రుఫాస్ పాల్, చీఫ్ ఆర్గనైజర్ డి.శ్రీనివాస్, విద్యార్థులు ఉన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న డాక్టర్ విజయశేఖర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఒక వ్యక్తి నేత్రాలను దానం చేయటం వలన ఇద్దరి అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కోలా విజయ శేఖర్ తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని బుధవారం భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్‌లో నేత్రదానం విశిష్టత, అంధత్వ నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎన్నో రకాల దానాలు ఉన్నాయని, వాటిల్లో స్వార్థం ఎరుగని ఏకైక దానం నేత్ర దానమని పేర్కొన్నారు. ఎయిడ్స్, పచ్చ కామెర్లు, రేబీస్(కుక్క కాటు) మినహా ఏ కారణంతో చనిపోయినా నేత్ర దానం చేయవచ్చని చెప్పారు. నేత్ర దాత మరణించిన తరువాత ఆ శరీరం నుంచి సేకరించిన రక్తాన్ని పరీక్షించి ఎటువంటి జబ్బులు లేవని నిర్ధారించుకున్న అనంతరమే వేరొకరికి ఆ కళ్లను అమరుస్తారని తెలిపారు. మనిషి మరణించిన తరువాత అతని కళ్లు మాత్రం 6 గంటల వరకు గాలిలోని ఆక్సిజన్‌ను స్వీకరిస్తూ బతికే ఉంటాయన్నారు. ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్ వ్యవస్థాపకుడు డాక్టర్ కోటేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు దేవతి నాగేశ్వరరావు, ఉమా శంకర్, డాక్టర్ జీ రమ్య, అష్ట మాలిక్ అసిస్టెంట్‌లు రత్నకుమారి, సునీత, హారిక, శ్యామలరావు, నేతాజీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

14న వాహనాలకు బహిరంగ వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ ఈ.స్వరాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు సీతారామపురం సిగ్నల్ వద్ద ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ నందు వేలం నిర్వహిస్తామన్నారు. మూడు టూ వీలర్ వాహనాలకు వేలం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనదలచిన ఔత్సాహికులు రూ.5 వేలు ధరవత్తు చెల్లించాలని చెప్పారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీ చెల్లించి వాహనాలు స్వాధీనం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94409 02455, 99595 10446 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కుండపోత వర్షం రోడ్లు జలమయం



బెంజిసర్కిల్ వద్ద భారీగా నిలిచిన వర్షం నీరు



పోరంకిలో జలమయమైన జాతీయ రహదారి

పెనమలూరు: విజయవాడ నగరంతో పాటు పెనమలూరు నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాధారణంగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయి మేఘావృతమై భారీ వర్షం పడింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగరంతో పాటు పెనమలూరు మండల పరిధిలోని పోరంకి, కామయ్యతోపు, కానూరు ప్రాంతాల్లో రహదారులు వర్షం కారణంగా మునిగిపోయాయి.